## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే పర్యటన ఇలా..

పామర్రు: పామర్రు శాసన సభ్యులు కై లే అనిల్‌కుమార్ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిపరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మొవ్వ మండలంలోని వేములవాడ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మొవ్వ: మండలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం వేములమడ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు వైస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు ఆదివారం తెలిపారు. వేములమడ గ్రామంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పిలుపు నిచ్చారు.

### జీవామృతం తయారీపై అవగాహన

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో పెరటి తోటలకు ద్రవ జీవామృతం తయారీ విధానం, ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ కషాయాలు సామూహికంగా తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని పేర్కొన్నారు. ఖర్చు తగ్గడమే కాక అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### దీపావళి షాపుల నిర్వహణకు దరఖాస్తు చేయండి

గుడివాడ టౌన్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రిటైల్ ఫైర్ క్రాకర్స్ షాపులు ఏర్పాటు చేయదలచిన వారు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ది గుడివాడ రిటైల్ ఫైర్ క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి మహేష్ కోరారు. స్థానిక శ్రీనివాస సెంటర్‌లో అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి కావాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను అసోసియేషన్ కార్యాలయంలో అందజేస్తే, అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహికంగా లైసెన్స్ పొందేందుకు కృషి చేస్తామన్నారు. వివరాలకు 98497 73799ను సంప్రదించాలని కోరారు.

### దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

కైకలూరు: దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. దేవీ శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా గోపవరంలో ఆదివారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉలిసి శ్యాంబాబు, పోతునూరి అజయ్, చింతపల్లి శ్రీను, దాసరి రామలింగం, పోలవరపు సుబ్బయ్య, వీరవల్లి కోటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నలుగురికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు రూ.2.61 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి మండలానికి చెందిన ఇద్దరికి, ఘంటసాల, మోపిదేవి మండలాలకు చెందిన ఒక్కొక్కరికి కలిపి మొత్తం రూ.2,61,000 విలువగల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

### పేదలకు రగ్గుల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని మండలిపురంలో 50 మంది పేదలకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రగ్గులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో పేదలు చలిని తట్టుకునేందుకు వీటిని అందజేశామని చెప్పారు. వార్డు మాజీ సభ్యుడు దేగల రాఘవ, తోట నరసింహానాయుడు, లీలా ఫణీంద్ర పాల్గొన్నారు.

# పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు



చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఆటలాడుకుంటున్న చిన్నారులు

పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరు గడించిన ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు ఆటపాక పక్షుల కేంద్రానికి విచ్చేశారు. బోటు షికారు చేస్తూ దగ్గర నుంచి పిలికాన్, పెయింటెడ్ స్టాక్ పక్షుల కేరింతలను ఆనందోత్సాహాలతో ఆస్వాదించారు. సమీపంలోని పక్షి నమూనా మ్యూజియంలో చిత్రాలను పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు. చిన్నారులు చిల్డ్రన్స్ పార్క్‌లో వివిధ ఆట వస్తువులతో ఆటలాడుకున్నారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరులో పక్షుల విశేషాలు, భౌగోళిక నైసర్గిక స్వరూపం, ప్రజల జీవన విధానాలు, శీతోష్ణస్థితి పరిస్థితులపై పర్యాటకులకు వివరించి అవగాహన కల్పించారు.

– కైకలూరు

## 150 మందికి ఫిట్‌నెస్ పరీక్షలు



సామర్థ్యాన్ని అంచనా వేస్తున్న టెక్నీషియన్లు

గుడివాడ టౌన్: స్థానిక టీచర్స్ కాలనీ మున్సిపల్ కమ్యూనిటీ హాలులో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహనా సదస్సు నిర్వహించారు. సాయి జననీ న్యూట్రీషియన్ క్లబ్, మానవతా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 150 మందికి హెల్త్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పరికరం ద్వారా వ్యక్తి శక్తి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా మనిషి ప్రస్తుత సామర్థ్యం గుర్తించవచ్చన్నారు. వయస్సు, బరువు, ఎత్తు ఆధారంగా ప్రస్తుత వ్యక్తి యొక్క సామర్థ్యం గుర్తిస్తారని, అనంతరం వారిలో ఉన్న రుగ్మతలను అనుసరించి ఆరోగ్యాన్ని ఏ విధంగా మెరుగుపర్చుకోవచ్చో వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి దోనేపూడి సరస్వతి, న్యూట్రీషియన్ క్లబ్ డెమోన్‌స్ట్రేటర్లు సునీత, శ్రీలక్ష్మి, సుధశ్రీ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గ్రహణానంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పామర్రు: చంద్ర గ్రహణం పూర్తయిన సందర్భంగా పలు ఆలయాల్లో స్వాములకు ఆదివారం విశేష కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత ఆలయాల తలుపులను తెరచి ఆలయాలను శుభ్రం చేశారు. అనంతరం ఆలయంలోని స్వామివార్లను ప్రత్యేకంగా జలాభిషేకాలను నిర్వహించారు. పంచామృతాలైన ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారలతో విశేషంగా అభిషేకాలు చేశారు. శత సహస్ర నామాలతో స్వామికి విశేషంగా పూజాధికాలను జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక విష్ణాలయం, సోమేశ్వరస్వామి ఆలయంలో, కన్యకా పరమేశ్వరి, అంకమ్మతల్లి, రామలింగేశ్వరస్వామి, మండల పరిధిలోని జమీదగ్గుమిల్లిలో సీతారామాంజనేయస్వామి, రాపర్లలో వీరాంజనేయస్వామి తదితర దేవాలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వామివార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

# భూ వివాదాలకు చెక్



డ్రోన్ ద్వారా రీ సర్వేను పరిశీలిస్తున్న సిబ్బంది

- ముమ్మరంగా రీ సర్వే
- భూములకు డిజిటల్ కార్డులు, రైతులకు హక్కు పత్రాలు
- మండలంలో 10 గ్రామాల్లో ముమ్మరంగా రీ సర్వే



పమిడిముక్కల: అస్తవ్యస్తంగా మారిన భూముల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన రీసర్వే సత్ఫలితాలనిస్తోంది. గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**మండలంలో 10 గ్రామాల్లో రీ సర్వే..**

మండలంలో 10 గ్రామాల్లో రీ సర్వే ముమ్మరంగా జరుగుతోంది. గుర్రాల్లంక 157 ఎకరాలు, ఫత్తేలంక 384 ఎకరాల్లో సర్వే పూర్తయింది. గోపువానిపాలెం 499 ఎకరాలు, ఐనపూరు 393 ఎకరాలు, వేల్పూరు 599 ఎకరాలు, హనుమంతపురం 558 ఎకరాలు, అగినపర్రు 649 ఎకరాలు, శ్రీరంగపురం 868 ఎకరాలు, చెన్నూరివారిపాలెం 365 ఎకరాలు, పైడికొండలపాలెం 524 ఎకరాల్లో సర్వే వివిధ దశల్లో ముమ్మరంగా సాగుతోంది. సర్వే అనంతరం రైతుకు సంబంధించిన భూ హక్కు పత్రాలు త్వరలో ఇవ్వనున్నారు. భూమి కలిగిన ప్రతి రైతుకూ భూమి యాజమాన్య హక్కు కల్పిస్తారు.


**సర్వే జరిగే విధానం ఇదీ...**

తొలుత గ్రామ సరిహద్దు నిర్ధారిస్తారు. కేఎంసీ ఫైల్ ఆధారంగా డ్రోన్ ఫ్లై సర్వే చేస్తారు. డ్రోన్ ఫ్లై ద్వారా ఓఆర్ఐ మ్యాప్ తయారవుతుంది. ఓఆర్ఐ మ్యాప్ వల్ల రైతుల భూమల గట్టు, రాళ్లు, సర్వే నంబర్ల వారీగా గుర్తిస్తారు. గ్రౌండ్ ట్రూతింగ్ సందర్భంగా ప్రతి రైతుకు భూమి వద్ద హాజరై హద్దులు చూపిస్తారు. ఆ ప్రకారంగా గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన తరువాత దస్తావేజులు, పాస్‌బుక్‌లను పరిశీలిస్తారు. ప్రతి రైతుకూ ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌ను కేటాయిస్తారు. ఆ మ్యాప్‌లో కొలతలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రోవర్స్ ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా భూముల హద్దులను గుర్తిస్తారు. 14 అంకెల గల భూదార్ నంబర్‌ను ప్రతి రైతుకు కేటాయిస్తారు. పొలాల్లో సర్వే రాళ్లు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. రైతులు తమ భూమిని అమ్మాలంటే రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. దీంతో అక్రమ క్రయ, విక్రయాలకు తావులేకుండా పోతుంది.

**వివాదాల పరిష్కారం..**

సర్వేలో ఎదురవుతున్న భూ వివాదాల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వేయర్ బేతపూడి శ్యామ్‌ప్రకాష్ మణికుమార్, రీ సర్వే డీటీ డీటీ యేసుపాదం మండలంలో జరుగుతున్న సర్వేను పర్యవేక్షిస్తున్నారు.


**ముమ్మరంగా రీ సర్వే..**



రైతులకు సర్వేపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. గ్రామ స్థాయిలో విలేజ్ సర్వేయర్, వీఆర్ఓ, కార్యదర్శితో కమిటీ వేశాం. మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్, రీ సర్వే డీటీతో కమిటీ వేసి సర్వేను కొనసాగిస్తున్నాం. పొలాల్లో రాళ్లు పాతుకొనే విషయంలో రైతులు సహకరించాలి.

–మణికుమార్, మండల సర్వేయర్

**భూ వివాదాలకు విముక్తి..**



భూ సమస్యలపై సంవత్సరాల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. భూముల సర్వే, పట్టాదారు పాసుపుస్తకాల కొరకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు..భూ రక్ష పథకం ద్వారా భూ వివాదాల సమస్య శాశ్వతంగా తొలగింది. భూములను సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. భూ హక్కు పత్రాలు కూడా అందనున్నాయి. దీంతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులుబాటు ఏర్పడింది.

– యలమంచిలి గణేష్, రైతు, అగినపర్రు

## 166 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రియా

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఆస్పత్రి సిబ్బందితో కలిసి డాక్టర్ రియా 166 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 130 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించేందుకు రెండు ప్రత్యేక బస్సుల్లో పెదకాకానిలోని ఆస్పత్రికి తరలించామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. జమీలా మస్తాన్, కనిగంటి వెంకట నారాయణ, మత్తి శివ, తలశిల లీలా మనోహర్ తదితరులు రోగులకు సేవ లందించారు.

## ఆర్థిక సాయం అందజేత

కోడూరు: మందపాకల శివారు చింతకోళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పేరే చంటి ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను నాయకులు ఆదివారం పరామర్శించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ రూ.5 వేల నగదును అందించారు. ఎంపీటీసీలు బడే గంగాధరరావు, పరిశె వెంకటేశ్వరరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, ముద్దినేని చంద్రరావు పరామర్శించారు.

## కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపి పలువురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. వల్లూరుపాలెం నుంచి రొయ్యూరు వెళ్లే చిన్నకట్ట రహదారి సమీపంలో ఆదివారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తుండగా దాడి చేశామని ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలియజేశారు. ఈ దాడిలో 14 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని, రూ.3320 నగదు, రెండు కోడి పుంజులు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు 'స్పందన'

పామర్రు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 25 గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమస్యలను అర్జీల రూపంలో అందజేసి తగు విధమైన పరిష్కారం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



కలిదిండి: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కలిదిండి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక య్యారు. మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో విద్యార్థులకు ఆదివారం పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో పి.రోహిత్, ఈశ్వర్, పి.శివఫణీంద్ర, బాలికల విభాగంలో పి.మౌనిక, వై.బాల వెంకట సాయిదేవి ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన హైస్కూల్ పీడీడబ్ల్యూలు ఎ.మావుళేశ్వరరావు, బి.కృష్ణకుమారి, కె.రత్నదాసులను, విద్యార్థులను ఎంఈఓ పి.ప్రభాకర్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.స్వర్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్ హురుముతున్నీసా, తదితరులు అభినందించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నాగాయలంక: డబ్బులు ఎవరికీ ఊరికే రావు..రోజూ పోలీసులను నిందించే బదులు చట్టబద్ధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం మంచిదని స్థానిక ఎస్ఐ సుబ్రహ్మణ్యం అన్నారు. నాగాయలంక పోలీసుస్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలపై ఆదివారం ఆటో కార్మికులు, యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అతి వేగం మంచిది కాదని, రహదారుల మధ్యలో సడెన్‌గా ఆటోలు నిలిపివేయరాదని చెప్పారు. ప్రమాదాల నివారణకు, ప్రజల భద్రతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఏ విధంగా జరిమానాలు విధించేది తెలియజేస్తూ ఫ్లెక్సీ బ్యానర్లను ప్రదర్శించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు..**

స్థానిక మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఆదివారం మండల ప్రజలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సొమ్ము ప్రలోభాలకు గురై నష్టపోవద్దని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని పేర్కొన్నారు. లక్షల బహుమానం వచ్చింది, కొంత సొమ్ము చెల్లించమని కోరేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మోసపూరితమైన స్క్రాచ్ కార్డుల జోలికి పోవద్దని, ఇంటి వద్దే ఉండి లక్షలు సంపాదించవచ్చని, మీ సొమ్ము కాజేసేవారు అధికమైనందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: అధైర్యపడకండి..అండగా ఉంటామని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రోడ్డు ప్రమాద బాధితులకు భరోసా ఇచ్చారు. మంత్రివాడ గ్రామానికి చెందిన సచివాలయ కన్వీనర్లు కొలుసు నాగరాజు, రాజులపాటి వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ మంత్రివాడలో కొలుసు నాగరాజును పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఉయ్యూరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజులపాటి వెంకటేశ్వరరావును పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఊబమల్లేశ్వరి, మాజీ సర్పంచ్ వంపుగడవల హేమలత, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, పార్టీ నాయకులు మారపాక మహేష్, కొడాలి రాంబాబు, డొక్కు నాగకుమార్, వంపుగడవల పండమ్మ, ఈదా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

గుడివాడ టౌన్: కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుడివాడ ఆర్టీసీ డిపో కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మిక సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో రాష్ట్ర నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా సేవలందిస్తున్న నేపథ్యంలో ఈ విధమైన చర్యలు కార్మికుల్లో మనో ధైర్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. తక్షణమే నిందుతులందరినీ అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి ఎన్. మదన్‌మోహన్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ బాలాజి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రంగయ్య, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'గురజాడ'కు గుర్తింపు తెచ్చిన మాజీ సర్పంచికి సన్మానం



మాజీ సర్పంచ్ గురజాడ వెంకటేశ్వరావును సత్కరిస్తున్న రామచంద్రరావు

పమిడిముక్కల: గురజాడ గ్రామానికి మాజీ సర్పంచ్ గురజాడ వెంకటేశ్వరరావు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన మాజీ కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు అన్నారు. గురజాడ ఊరికి ఎంతో ఉపకారం చేశారని, ఆయన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గురజాడ వెంకటేశ్వరరావు గ్రామానికి దశాబ్దాలుగా అందించిన సేవలకు గుర్తుగా బహుజన సాహిత్య అకాడమీ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం గురజాడలో గ్రామస్తులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బీఎస్ఏ నిర్వహించిన అవార్డుల ప్రదానంలో వెంకటేశ్వరరావుకు సంఘ సేవకులుగా ఆచార్య వినోబాభావే పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురజాడలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించి అవార్డుల కార్యక్రమ ఫొటోలతో కూడిన ఆల్బమ్‌ను బహూకరించారు. ఈ ఆల్బమ్‌ను రామచంద్రరావు ఆవిష్కరించారు. రామచంద్రరావు మాట్లాడుతూ 20 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ సర్వోదయ సేవా ట్రస్ట్ ద్వారా వైద్య శిబిరం నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందజేశారన్నారు. ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని వెంకటేశ్వరరావు గ్రామస్తులకు సూచించారు. తనను సత్కరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, శివలెంక శంభూప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంపాన కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి గురవయ్య, గ్రామ పెద్దలు రాజులపాటి సుబ్బారావు, రామ్మోహనరావు, జగదీష్, సూర్యచంద్రరావు, సుబ్బారావు వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.